

బస్సు కండక్టర్‌పై మాజీ ఎమ్మెల్యే దాడి


గాయపడిన బాధితుడు హరినాథ్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

స్థానిక బెంగళూరు బస్టాండులో గురువారం ప్రయివేట్ బస్సు కండక్టర్ హరినాథ్‌పై మదనపల్లె మాజీ ఎమ్మెల్యే నవాజ్ బాషా దాడి చేసి కొట్టాడని బాధిత కండక్టర్ ఆరోపించాడు. బాధితుని కథనం మేరకు.. మదనపల్లె మండలం, చీకిలబైలు గ్రామం, ఎగువ దొనబైలుకు చెందిన హరినాథ్ మధుసూదన బస్సు కండక్టర్‌గా పనిచేస్తున్నాడు. రోజు మాదిరిగానే బెంగళూరు బస్టాండ్‌కు మధ్యాహ్నం బస్సు రావడంతో ప్రయాణికులను ఎక్కిస్తున్నాడు. గత బస్సు కంటే ముందు ప్రయాణికులను ఎక్కిస్తావా అంటూ హరినాద్‌పై మాజీ ఎమ్మెల్యే నవాజ్ బాషా విచక్షణా దాడి కొట్టాడు. అంతటితో ఆగకుండా తన అనుచరులను పిలిపించి కండక్టర్‌ను కొట్టించడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు బాధితున్ని ప్రభుత్వాసుపత్రికి తరలించి వైద్య చికిత్సలు అందించారు. తనపై జరిగిన దాడిని పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపాడు.

దళారుల దోపిడీని అరికట్టాలి

- వ్యవసాయ రుణాల మంజూరులో బ్యాంకర్ల అలసత్వం
- జడ్‌పి సర్వసభ్య సమావేశంలో సభ్యుల నిలదీత
- పలువురు ఎమ్మెల్యేలు, ఎంపీలు గైర్హాజర్


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లాలోని ఉద్యాన రైతులను నాలుగు అంచెల దళారీ వ్యవస్థ దోపిడీ చేస్తుండడంపై వేముల, వీరపునాయునిపల్లి, కమలాపురం జడ్‌పిటిసిలు ఆందోళన వ్యక్తం చేశారు. గురువారం స్థానిక జిల్లా పరిషత్ సభాభవనంలో చైర్మన్ గోవిందరెడ్డి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మొదటగా పహల్గాం అమర జవాన్ మురళీనాయక్, జడ్‌పి మాజీ ఛైర్మన్ సి.ఎం.బలరామిరెడ్డి మృతిపై రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతపురం, తిరుపతి ప్రాంతాల్లో చీనీ కాయలు టన్ను రూ.26 వేలు పలుకు తుండగా పులివెందుల్లో మాత్రం వ్యాపారుల సిండికేటై రూ.16 వేల నుంచి రూ.18 వేలకు పరిమితం చేస్తున్నారని పలువురు సభ్యులు పేర్కొన్నారు. ప్రొద్దుటూరు ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి స్పందిస్తూ స్థానిక రాజకీయ నాయకత్వమే దోపిడీకి పరోక్ష సహకారం అందిస్తోందని విమర్శించారు. వేముల, వీరపునాయునిపల్లి జడ్‌పిటిసిలు స్పందిస్తూ అటువంటి నాయకులపై కూటమి సర్కారు విచారణకు ఆదేశించి చర్యలు తీసుకోవాలని సూచించడంతో వ్యవహారం సద్దుమణిగింది. పులివెందుల, కడప మార్కెట్ యార్డుల్లో కనీస సదుపాయాలు కరువయ్యాయని, మార్కెటింగ్ శాఖ అధికార యంత్రాంగం మానిటరింగ్ చేయడం లేదని విమర్శించారు. ఫలితంగా పులివెందుల మార్కెట్‌లో 10 మంది వ్యాపారులు సిండికేటై ఇష్టానుసారంగా దోచుకుంటున్నారని తెలిపారు. కలెక్టర్ సర్‌ప్రైజ్ విజిట్ చేస్తే వాస్తవాలను బోధపడతాయని సూచించారు. చీనీ, అరటి, మామిడి ఇతర ఉద్యాన రైతులు నిలువు దోపిడీకి గురవుతున్నారని, ప్రభుత్వం గిట్టుబాటు ధరను కల్పించాలని వాపోయారు. ప్రొద్దుటూరు ఎమ్మెల్యే మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో నకిలీ విత్తనాలు, ఫెర్టిలైజర్స్, ఫెస్టిసైడ్స్ డీలర్లతో సమావేశం నిర్వహించి నకిలీ వ్యవహారాల గుట్టురట్టు చేయాలని, అవసరమైతే పీడీయాక్టు కేసులు నమోదు చేయాలని సూచించారు. జిల్లా వ్యవసాయశాఖ అలసత్వం వహిస్తే ఏడాదిపాటు పడిన శ్రమంతా బూడిదలో పోసిన పన్నీరు చందంగా మారుతుందని హెచ్చరించారు. చక్రాయపేట మండలాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించాలని జడ్‌పిటిసి శివప్రసాద్‌రెడ్డి డిమాండ్ చేశారు. గండిక్షేత్రంలో లక్ష లీటర్ల సామర్థ్యం కలిగిన వాటర్ ట్యాంకును ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని వివరించారు. ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ వ్యవసాయ రుణాలను మంజూరు చేయడంలో బ్యాంకర్లు ప్రభుత్వానికి చెడ్డపేరు తెస్తుండడంపై ఆందోళన వ్యక్తం చేశారు. రైతులకు చెందిన భూముల ఒన్‌బి ఫారాన్ని ఒరిజినల్ ఇవ్వకపోవడంతో బ్యాంకర్లు రుణ మొత్తాన్ని తగ్గిస్తున్నారని విఎన్‌పల్లి జడ్‌పిటిసి తెలిపారు. సికెదిన్నె, బి.కోడూరు జడ్‌పిటిసిలు మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం పథకం అమలు వివరాలను వెల్లడించాలని డిమాండ్ చేశారు. సగిలేరు గురకుల పాఠశాలలో విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గిపోతుండడంపై ఆందోళన వ్యక్తం చేశారు. కాశినాయన జడ్‌పిటిసి ముత్యాల చెన్నయ్య మాట్లాడుతూ కరువు పరిస్థితుల కారణంగా నష్టపోయిన రైతాంగాన్ని ఏమేరకు ఆదుకున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. వ్యవసాయశాఖ జిల్లా అధికారి స్పందిస్తూ రూ.16 కోట్ల మేరకు నష్టం వాటిల్లినట్లు ప్రతిపాదనలు పంపించామని వివరించారు. ప్రకృతి వైపరీత్యాల కారణంగా సుమారు 1,700 హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నాయని, అత్యధికంగా అరటి రైతులకు నష్టం వాటిల్లిందని హార్టీకల్చర్ డిడి సుభాషిణీ వివరించారు. రూ.4 కోట్ల ప్రతిపాదనలు చేశామని తెలిపారు. రైతుబజారులో కార్యకలాపాలను వేగవంతం చేయాలని వేంపల్లి జడ్‌పిటిసి సూచించారు. కలెక్టర్ శ్రీధర్ స్పందిస్తూ వేంపల్లిలో పాలనాపరమైన తప్పిదాలపై విచారణ చేపట్టామని, చక్రాయపేటలో తాగునీటి ఎద్దడి, పులివెందుల మండలాల్లో మార్కెటింగ్ సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు. ఎమ్మెల్సీ పి.రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ మైలవరం మండల పరిధిలోని ఎస్‌ఎఐఎల్ అనే సోలార్ కంపెనీ రైతుల భూములను దౌర్జన్యంగా ఆక్రమిస్తూ రైతులపైనే కేసులు నమోదు చేస్తుండడంపై ఆందోళన వ్యక్తం చేశారు. కల్వటాల గ్రామ పరిధిలో ఒక కొండ పరిధిలోని 200 ఎకరాలను ఆక్రమించుకుందన్నారు. పంచాయతీల పరిధిలోని గ్రేజీ భూ ములను సైతం కబ్జా చేస్తోందని తెలిపారు. చీనీ రైతులు తోటలను జెసిబిలతో దున్నేస్తోందని, ప్రశ్నించిన, అడ్డుకున్న రైతులపైనే వ్యవసాయశాఖ, రెవెన్యూ, పోలీస్ యంత్రాంగాలు కుమ్మక్కై కేసులు నమోదు చేసి జైలుకు పంపిస్తోందని వాపోయారు. వ్యవసాయం లేకుండా పరిశ్రమలు మనలేవని సంగతిని గ్రహించాల్సిన అవసరం ఎంతైనా ఉందనే సంగతిని గ్రహించాలని, కలెక్టర్ జోక్యం చేసుకుని సోలార్ కంపెనీ ఇష్టా రాజ్యానికి అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. బద్వేల్ ఎమ్మెల్యే డాక్టర్ సుధా స్పందిస్తూ వరికుంట్ల లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుకు విద్యుత్ కనెక్షన్‌తోపాటు లైవ్‌లోకి తీసుకురావాలని చెప్పారు. బి.మఠం జడ్‌పిటిసి స్పందిస్తూ టిజిపి లీకేజీలను అరికట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. మైలవరం కెనాల్ ఆక్రమణలపై నీటిపారుదలశాఖ సక్రమంగా వ్యవహరించడం లేదని ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. విద్యాక్రమబద్ధీకరణపై ఒకటి, రెండు మినహా మిగిలిన తరగతుల నిర్వహణ విషయంలో విమర్శలు వస్తున్నాయని చెబుతుండగా కలెక్టర్ జోక్యం చేసుకుని తొమ్మిది రకాల పాఠశాలలుగా క్రమబద్ధీకరణ చేశారని, ఒకటి, రెండు తరగతులను మినహాయిస్తే మిగిలిన తరగతులకు సబ్జెక్టు నిపుణుల నియామకంతో నాణ్యమైన విద్యను అందించే ప్రయత్నం జరుగుతోందని, రాజకీయ నాయకత్వం సైతం తల్లిదండ్రులకు అర్థమయ్యేలా వివరించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఉమ్మడి జిల్లాకు చెందిన 11 మంది ఎమ్మెల్యేలు, ఇద్దరు ఎంపీల్లో ఇద్దరు ఎమ్మెల్యేలు మినహా మిగిలిన వారు గైర్హాజరు కావడం గమనార్హం. సమావేశంలో జడ్‌పిటిసిలు, ఎంపిపిలు, ఉమ్మడి జిల్లాకు చెందిన జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

రేషనలైజేషన్ పేరిట 'కత్తి'రింపు!

రేషనలైజేషన్ పేరుతో ఉపాధ్యాయ పోస్టుల కుదింపునకు రంగం సిద్ధమైంది. ప్రభుత్వం జాతీయ నూతన విద్యా విధానం అమలులో భాగంగా ప్రాథమిక విద్యను తొమ్మిది రకాల పాఠశాలలను నిర్వహిస్తామనే పేరిట జారీ చేసిన జిఒ నెంబర్ 20 పేర్కొంది. ప్రభుత్వం వర్గీకరించిన తొమ్మిది రకాల కేటగిరీల్లో భాగమైన మోడల్ ప్రైమరీ పాఠశాలలపై తీవ్ర ప్రభావం పడుతుంది. ఉపాధ్యాయులను సర్‌ప్లస్‌గా చూపించే ప్రయత్నం చేసింది. సర్‌ప్లస్ ఎస్‌జిటిలకు హెచ్‌ఎంలుగా ప్రమోషన్ల కల్పిస్తున్న పేరిట గ్రామీణ పాఠశాలలకు తరలించే డిమోషన్‌కు శ్రీకారం చుట్టడంపై జిల్లాలోని ఉపాధ్యాయ సంఘాల నుంచి నిరసన వ్యక్తమవుతోంది.



- మోడల్ ప్రైమరీ పాఠశాలలపై పెనుప్రభావం
- 9 రకాల పాఠశాలల ఏర్పాటు చేస్తూ జిఒ
- ప్రమోషన్ల పేరుతో ఎస్‌జిటిలకు డిమోషన్?!
- ఇంగ్లీష్ మీడియంలోనే విద్యా బోధన



ప్రజాశక్తి - కడప ప్రతినిధి

ఉమ్మడి జిల్లాలో ప్రాథమిక విద్య ప్రభావశీల మార్పులకు గురవుతోంది. కడప జిల్లాలో 2,816, అన్నమయ్య జిల్లా పరిధిలోని రాజంపేట, రైల్వేకోడూరు, రాయచోటి నియోజకవర్గాల పరిధిలో 1110 పాఠశా లలున్నాయి. ప్రైమరీ 1,872, మున్సిపల్ 82, ఎయిడెడ్ 66, ప్రయివేటు 723, మదరసాలు ఏడు పాఠశాలల చొప్పున ఉన్నాయి. కడప జిల్లాలో 3,05,663, అన్న మయ్య జిల్లాలోని మూడు నియోజకవర్గాల పరిధిలోని పాఠశాలలో 62,261 మంది విద్యార్థులు ఉన్నారు. ప్రభుత్వం తాజాగా విడుదల చేసిన జిఒ నెంబర్ 20 ద్వారా ప్రాథమిక విద్యను తొమ్మిది రకాల పాఠశాలలుగా వర్గీకరించింది. శాటిలైట్ ఫౌండేషన్ స్కూల్స్, ఫౌండేషన్ స్కూల్స్, బేసిక్‌ప్రైమరీ స్కూల్, మోడల్ ప్రైమరీ స్కూల్స్, అప్పర్ ప్రైమరీ స్కూల్స్, హైస్కూల్స్ (6 నుంచి 10). హైస్కూల్ క్లాసెస్ (ఒకటి నుంచి 10). హైస్కూల్ ప్లస్ (6 నుంచి 12) పాఠశాలలు, హైస్కూల్ ప్లస్ (ఒకటి నుంచి 12 వరకు) పాఠశాలలు ఉన్నాయి. మోడల్ ప్రైమరీ పాఠశాలలు ప్రభావితం అవుతున్నాయనే వాదన వినిపిస్తోంది. మోడల్ ప్రైమరీ పాఠశాలల్లో ఒకటవ తరగతి నుంచి ఐదవ తరగతి వరకు బోధించాల్సి ఉంది.ఎక్కువ సంఖ్యలో ఒకటి, రెండు తరగతులను నిర్వహించనున్నట్లు తెలుస్తోంది. ఫలితంగా మిగిలిన మూడు, నాలుగు, ఐదు తరగతుల విద్యార్థులు కిలోమీటరు దూరంలోని పాఠశాలలకు వెళ్లాల్సి వస్తోంది. సదరు గ్రామీణ విద్యార్థులు ప్రయివేటు, కార్పొరేట్ పాఠశాలలకు తరలిపోయేలా చేస్తోందనే విమర్శ పెద్దఎత్తున వినిపిస్తోంది. పంచాయతీకి ఒకటి చొప్పున పాఠశాల నిర్వహించాలనే డిమాండ్‌ను గాలికి వదిలేయడం ఆందోళన కలిగిస్తోంది. వైసిపి సర్కారు హయాంలో పాఠశాలల కుదింపుపై పెద్దఎత్తున ఆందోళనలు, నిరసనలు నెలకొన్న సంగతి తెలిసిందే. తాజాగా కూటమి సర్కారు సైతం వైసిపి ఆరు పాఠశాలల తరహాలోనే రెండు మీడియం తరహాలో తెలుగు మీడియాన్ని సైతం తొలగించడం గమనార్హం. ఇంగ్లీష్ మీడియంలో బోధించడం, తరగతి గదుల్లో విద్యార్థులను 45 నుంచి 54 మందికి పెంచడం, మిగిలిన వారిని సర్‌ప్లస్ ఉపాధ్యాయులుగా చూపించడం, సదరు ఎస్‌జిటిలను హెచ్‌ఎంలుగా ప్రమోషన్ల పేరుతో గ్రామీణ ప్రాంతాల కు తరలించి డిమోషన్ అనుభవాల్ని కలిగిస్తోందనే వాదన వినిపిస్తోంది.

ఉపాధ్యాయ పోస్టులను కుదించే యత్నమిది

ప్రభుత్వ తొమ్మిది రకాల పాఠశాలల కాన్సెప్ట్ ఉపాధ్యాయుల కుదింపులో భాగమేనని సందేహాల్ని కలిగిస్తోంది. తరగతి గదుల్లో విద్యార్థుల సంఖ్యను పెంచడం ద్వారా మిగిలిన ఉపాధ్యాయులను సర్‌ప్లస్‌గా చూపించడం దారుణం. సర్‌ప్లస్ ఉపాధ్యా యులను ప్రమోషన్ల పేరిట గ్రామీణ ప్రాంతాలకు తరలించే డిమోషన్ చేయడం ఆందోళనకరం.

- పి.మహేష్, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి, కడప.

ప్రయివేటు పాఠశాలలను ప్రోత్సహించడమే

మోడల్‌ప్రైమరీ పాఠశాలలో ఎక్కువగా ఒకటి, రెండు తరగతులు నిర్వహించడం ద్వారా మూడు, నాలుగు, ఐదు తరగతుల పిల్లలను కిలోమీటర్ దూరంలోని పాఠ శాలలకు వెళ్లేలా చేయడం ప్రయివేటును ప్రోత్సహించడం అవుతుందనడంలో సందేహం లేదు.

- రవి, ఎస్‌ఎఫ్‌ఐ, జిల్లా కార్యదర్శి, కడప.

ఉర్దూ పోస్టులు కొనసాగించాలి

ఉర్దూ పాఠశాలల్లో పార్లల్ ఉర్దూ ఉపాధ్యాయ పోస్టులను కొనసాగించాలి. ఉర్దూ పాఠశాలలు నిర్వీర్యం చేసే ప్రయత్నం చేయడం దారుణం. **- సయ్యద్ ఇక్బాల్, ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు.**

తెలుగు మీడియాన్ని రద్దు చేయడం దారుణం

తెలుగు మీడియాన్ని పూర్తిగా రద్దు చేయడం దారుణం. సెక్షన్‌కు 45 మంది విద్యార్థులు ఉండగా, పునర్వవస్థీకరణలో 53 మంది విద్యార్థులను కేటాయించడంతో ఉపాధ్యాయ పోస్టులు మిగిలి పోతున్నాయి. విద్యార్థుల నిష్పత్తిని 1.45గా ఉండాలి.

- షేక్, జాబిర్, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి, అన్నమయ్య.

పేద విద్యార్థులకు అందని విద్య

వైసిపి సర్కారు 117 జిఒ ప్రకారం ఆరు రకాల పాఠశాలలతో మార్పులు చేసింది. కూటమి సర్కారు 19, 20, 21 జిఒలను తీసుకుని తొమ్మిది రకాల పాఠశాలలతో ప్రభుత్వ విద్యారంగాన్ని ఏవిధంగా అభివృద్ధి చేయగలరో చెప్పాలి. ఉపాధ్యాయ, విద్యార్థి, మేధోసంపత్తులతో చర్చలు చేసి పునర్వ వస్థీకరణ చేసి ఉంటే బాగుండేది.

- నరసింహా, ఎస్‌ఎఫ్‌ఐ, జిల్లా ప్రధాన కార్యదర్శి, అన్నమయ్య.


టీ తాగుతూ ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

ప్రజా సమస్యలకే ప్రాధాన్యత : మంత్రి 'మండిపల్లి'

ప్రజాశక్తి-మదనపల్లె

ప్రజా సమస్యలకే అధిక ప్రాధాన్యత ఇస్తానని రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం ఉదయం మదనపల్లి మండలంలోని కర్ణాటక-ఆంధ్రప్రదేశ్ సరిహద్దు ప్రాంతంలోని చీకలబైలులో ఓ చిన్న టి షాపు వద్ద అనూహ్యంగా ప్రత్యక్షమయ్యారు. అక్కడున్న సాధారణ ప్రజలతో మమేకమవుతూ, వారి కష్టాలు అడిగి తెలుసుకుంటూ, స్వయంగా టి తయారు చేసి వడ్డించడంతో స్థానికులు ఆశ్చర్యానికి గురయ్యారు. మంత్రి హోదాలో ఉన్నా, ఎటువంటి ఆర్భాటం లేకుండా సాధారణ వ్యక్తిలా ప్రజల మధ్యకి వెళ్లి వారి అభిప్రాయాలు తెలుసుకోవడం ఈ పర్యటనలో ప్రధాన ఆకర్షణగా నిలిచింది. పేద ప్రజలకు ఎక్కువ సమయం కేటాయిస్తూ, వారి సమ స్యలను నేరుగా తెలుసుకొని పరిష్కార మార్గాలు సూచిస్తున్న మంత్రి తీరుపై ప్రజలు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. మంత్రి టి షాప్‌లో ఉండటం చూసిన కొందరు స్థానికులు ఆయనతో సెల్ఫీలు తీసుకుంటూ ఆనందం వ్యక్తం చేశారు. ప్రజల మధ్య మంత్రి ఎక్కువగా ఉండే ప్రయత్నం, వారి మాటలు నేరుగా వినడం ఆయన ప్రజానికానికి దగ్గరగా ఉండే విధానాన్ని మరింత బలపరిచిందని స్థాని కులు పేర్కొన్నారు. చీకలబైలు సర్పంచ్ ప్రభాకర్, ప్రజలు పాల్గొన్నారు.

వెలిగల్లులో మౌలిక వసతులు కల్పిస్తాం

గాలివీడు : వెలుగల్లు గ్రామంలో అన్ని మౌలిక వసతులు కల్పించి అభివృద్ధి చేస్తామని మంత్రి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం మంత్రి మండలంలోని వెలిగల్లు గ్రామంలో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో అభివృద్ధికి నోచుకోని వెలిగల్లు గ్రామంలో అన్ని మౌలిక వసతులు కల్పించి అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. ఈ గ్రామంలో సరైన రోడ్లు, డ్రెయినేజీ కాలవలు, వీధిలైట్లు లేక ప్రజలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొనే వారిని కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గ్రామంలో సిమెంట్ రోడ్లు, డ్రెయినేజీ కాలవలు, వీధిలైట్లు ఏర్పాటు చేసి గ్రామాన్ని ఆదర్శంగా అభివృద్ధి చేశామని తెలిపారు. వెలిగల్లు గ్రామ ప్రజలు సమర్పించిన అర్జీలను మంత్రి అక్కడికక్కడే పరిష్కరించి బాధితులకు న్యాయం చేశారు. అనంతరం పలువురు టిడిపి నాయకుల ఆహ్వానం మేరకు మంత్రి వారి ఇంటికి వెళ్లి ప్రతి ఒక్కరిని పేరుపేరునా పిలిచి ఆప్యాయంగా పలకరించారు.

ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : అక్లిన్ ప్యాత్ ల్యాబ్స్ ఆధ్వర్యంలో శుక్ర, శనివారాల్లో నిర్వహిస్తున్న వైద్య శిబిరాన్ని పట్టణ, పరిసర ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆ సంస్థ మేనేజర్ ప్రదీప్ అలియాస్ రాజు మైకా తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ అప్లిన్ ప్యాత్స్ ల్యాబ్స్ ఆధ్వర్యంలో పట్టణంలోని స్థానిక ఉర్దూ మున్సిపల్ హైస్కూల్‌లో రెండు రోజులపాటు ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నామన్నారు. శ్రీ రామస్వామి హృదయాలయ వైద్యులు, అగర్వాల్ దృష్టి ఆసుపత్రి వైద్యులు వైద్య శిబిరంలో పాల్గొని గుండె జబ్బులు, కంటి జబ్బులు కలవారికి ఉచిత పరీక్షలు చేస్తారని పేర్కొన్నారు. ఉచిత కన్సల్టేషన్, ఇసిజితో సహా అవసరమైన పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. స్థానిక ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ప్రారంభిస్తున్న ఈ వైద్య శిబిరాన్ని పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకొని వారి ఆరోగ్య సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేసే వరకూ పోరాటం

- రౌండ్ టేబుల్ సమావేశంలో కార్మిక, రైతు సంఘాల నేతలు


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

కార్మికుల నడ్డి విరిచేందుకు తెస్తున్న నాలుగు లేబర్ కోడ్స్ రద్దు అయ్యేంత వరకూ ఐక్యంగా పోరాడతామని కార్మిక, రైతు సంఘాల నాయకులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను హెచ్చరించారు. గురువారం స్థానిక ఎన్‌జిఒ హోంలో సిఐటియు జిల్లా కార్యదర్శి డి.భాగ్యలక్ష్మి అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు, ఎఐటియుసి జిల్లా నాయకులు ఎం.విశ్వనాధ్, ప్రయివేట్ ఎలక్ట్రికల్ యూనియన్ జిల్లా అధ్యక్షులు అస్లాం, మున్సిపల్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు ఎం.చెన్నయ్య, వై.శంకరయ్య, యుఇసిడబ్ల్యుయు డిస్కమ్ నాయకులు కె.సుబ్రహ్మణ్యం రాజు, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కె.నాగబసిరెడ్డి, అంగన్వాడీ జిల్లా సహాయక కార్యదర్శి ఎస్.ఓబుళమ్మ మాట్లాడుతూ కార్పొరేట్ల ప్రయోజనాల కోసం వారిచ్చే కమీషన్లకు కార్మిక చట్టాలు హక్కులు రద్దు చేసి కట్టు బానిసలుగా మార్చడం కోసం నాలుగు లేబర్ కోడ్స్ తేవడాన్ని తీవ్రంగా ముక్త కంఠంతో వ్యతిరేకిస్తున్నామని పేర్కొన్నారు. ఒక వైపు కార్పొరేట్లకు రుణాలు మాఫీ చేస్తూ, కొత్తరుణాలు ఇస్తున్నారని పేద ప్రజలపై చిన్న మధ్య తరహా పరిశ్రమల యాజమాన్యాలపై విద్యుత్ యూజర్ ఛార్జెస్, జిఎస్‌టి, పన్నులు వేయడంతో వేల సంఖ్యలోపరిశ్రమ లు మూత పడ్డాయని ఫలితంగా కార్మికులు రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. విశాఖ ఉక్కును నష్టాల పేరుతో ప్రయివేట్ చేసే ప్రయత్నం మానుకోవాలన్నారు. రైతుల పంటలకు గిట్టు బాటు ధర ఇవ్వకుండా, కార్పొరేట్ వ్యవసాయం పేరుతో నల్ల చట్టాలు తెచ్చి భూమి లాక్కునే పరిస్థితి వస్తే కూరగాయల ధరలు అడ్డు అదుపు లేని పరిస్థితి దాపురిస్తుందని రైతుల ఆత్మహత్యలు నివరించాలని మాట్లాడారు. కార్మికులు సంఘం పెట్టుకునే హక్కు నుండి చనిపోయిన తర్వాత పెన్షన్ హక్కులు వరకు ఉన్న చట్టాలు ప్రాణ త్యాగాలతో కూడుకున్నవని ఇలాంటి పరిస్థితిలోనైనా వాటిని రద్దు కానివ్వమని ప్రతినబూనారు. 20న సమ్మె పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో పెద్ద ఎత్తున రైతు, కార్మిక ఉద్యోగులను ప్రజలతో కలిపి పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎఐటియుసి నాయకులు రెడ్డెయ్య, ప్రయివేట్ ఎలక్ట్రిసిటీ యూనియన్ నాయకులు శంకర్‌రెడ్డి, రైతు సంఘం నాయకులు ఈశ్వరయ్య, మున్సిపల్ వాటర్ సెక్షన్ చంద్రశేఖర్, రాజు, హమాలీ నాయకులు, మాధవయ్య, అంగన్వాడీ నాయకులు సిద్ధమ్మ, లక్ష్మిదేవి, రెడ్డెమ్మ, సుమలత, నాగమణి, ఉమా, పావని, యశోద, సుహాసిని, అనూష, ఆశా రమాదేవి ఇఫ్టు నాయకులు గౌసియా, బీడీ రంగం నసీబ్ జాన్, వైయస్సార్ ట్రేడ్ యూనియన్ నాయకులు అశోక్ నైతిక మద్దతు తెలిపారు.

శిక్షణా తరగతులను జయప్రదం చేయండి

- ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అశోక్



మాట్లాడుతున్న ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అశోక్

ప్రజాశక్తి- మదనపల్లె అర్బన్

మదనపల్లె పట్టణంలో ఈ నెల 17వ తేదీ నుంచి 26వ తేదీ వరకు ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్ర విద్యా వైజ్ఞానిక తరగ తులను జయప్రదం చేయాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అశోక్ పిలుపు నిచ్చారు. గురువారం స్థానిక ఎస్‌ఎఫ్‌ఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థుల పక్షాన అను నిత్యం పోరాడుతూ, విద్యార్థులను చైతన్యం చేసి స్వాతంత్రం సమర యోధుల స్ఫూర్తితో ఎస్‌ఎఫ్‌ఐ అగ్ర భాగాన ఉందన్నారు. ఈ శిక్షణ తరగ తులకు రాష్ట్ర నలుమూలల నుండి 300 మందికి పైగా ప్రతినిధులు హాజరు కానున్నారని, విద్యారంగ పరిరక్షణ కోసం ఉపాధి అవకాశాల కోసం భవిష్యత్తులో ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. విద్య కార్పొరేటీకరణకు వ్యతిరేకంగా ఎస్‌ఎఫ్‌ఐ అనునిత్యం పోరాడుతుందని స్పష్టం చేశారు. నేటి సమాజంలో కార్పొరేట్ వ్యవస్థ రోజు రోజుకు పెరుగు తున్న నేపథ్యంలో విద్య వ్యాపారీ కరణ, కార్పోరేటీ కరణ, కాషాయకరణకు వ్యతిరేకంగా ఉద్యమాలు చేయాల్సిన దుస్థితి నెలకొందన్నారు. ప్రభుత్వ విశ్వవిద్యాలయాలు, ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, పాఠశాలల పరిరక్షణకై ఎస్‌ఎఫ్‌ఐ నిరంతరం పోరాడు తుందన్నారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్షిప్స్, ఫీజు రీయింబర్స్మెంట్ విడుదల చేయడంలో ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం తగన్నారు. ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న బకాయిలు, చెల్లించాలని లేనిపక్షంలో విద్యార్థులతో కలిసి రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ప్రభుత్వం విద్యారంగంలో నూతన మార్పులు తీసుకొస్తామని గొప్పగా చెప్పుకుంటుందన్నారు. నేటికి గత ప్రభుత్వం విధానాలనే కొనసాగిస్తుందన్నారు. జిఒ నెంబర్ 117 రద్దు చేస్తూనే నూతనంగా 9 రకాలు పాఠశాలను తీసుకొస్తున్నామని గొప్పగా చెప్పుకుంటూ ప్రభుత్వ విద్యా సంస్థలను నిర్వీర్యం చేస్తూ కార్పొరేటర్ విద్యా సంస్థలకు వత్తాసు పలుకుతోందన్నారు. ఈ విధానాల వల్ల పేద విద్యార్థులు చదువుకు దూరం అవుతారని చెప్పుకొచ్చారు. తక్షణమే ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేసి, విద్యాసంస్థల అభివృద్ధికి నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సర్వేపల్లి నరసింహా, రమణ, మదనపల్లి టౌన్ నాయకుడు జయబాబు, ఆఫ్రిద్ పాల్గొన్నారు.


కబ్జాకు గురైన వాగులు, వంకల భూములను చూపుతున్న సిపిఎం నాయకులు

వాగులు, వంకలనూ వదలని అధికార పార్టీ నేతలు

- సిపిఎం జిల్లా కన్వీనర్ పి.శ్రీనివాసులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

అధికార పార్టీ నేతలు వాగులు, వంకలను వదలడం లేదని, సీటియం వద్ద స్పిన్నింగ్ మిల్లు కొనుగోలు చేసిన రియల్ ఎస్టేట్ వ్యాపారులు వంక భూ ములను యథేచ్ఛగా ఆక్రమించి ప్లాట్లుగా మారుస్తున్నారని సిపిఎం జిల్లా కన్వీనర్ పి.శ్రీనివాసులు ఆరోపించారు. గురువారం సిపిఎం కార్యకర్తలతో కలిసి సిటిఎం ప్రాంతంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వే నెంబర్ 744, 745, 795 ద్వారా ప్రవహించే రెండు వాగులను, నేతాజీ కాలనీ నుండి వచ్చే మురుగు నీటి కాలువలను పూర్తిగా పూడ్చివేసి ప్లాట్లుగా మారుస్తుంటే అధికా రులు మామూళ్ల మత్తులో జోగుతున్నారా అని ప్రశ్నించారు. తిరుపతి జాతీయ రహదారిని అనుకుని ఉన్న మురుగు నీటి కాలువను ఆక్రమించడం వల్ల రోడ్డు తెగి పోయే ప్రమాదం ఉందని, డ్రైనేజి ఇళ్లల్లోకి ఎగబడే అవకాశం ఉందన్నారు. పరిశ్ర మల భూములను, రెసిడెన్షియల్ భూములుగా మార్పు చేయకుండా, లే అవుట్ అప్రూవల్ తీసుకోకుండానే ప్లాట్లు వేసుకుని అమ్ముకుంటున్నా అధికారులు ఎందు కు స్పందించడం లేదని ప్రశ్నించారు. భూ కబ్జాలు సహించేది లేదన్న ఎమ్మెల్యే షాజహాన్ బాషా ఎందుకు స్పందించడంలేదని ప్రశ్నంచారు. వాగు భూములను పరిరక్షించాలని, లేని పక్షంలో ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు అశోక్, నరసింహ, రమణ, జయరాం, ఆఫ్రిద్ పాల్గొన్నారు.

కేన్సర్ రోగులకు కేశదానం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

కేన్సర్ బాధితుల మోహల్లో చిరునవ్వు చిందించడానికి హెల్పింగ్ మైండ్స్ గొప్ప సంకల్పంతో తలపెట్టిన హెయిర్ డోనేషన్ కార్యక్రమానికి మహిళలు, అమ్మాయిలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి కేశాలు దానం చేస్తున్నారు. గురువారం మదనపల్లికు చెందిన జర్నలిస్టు విజయ్ కుమార్ భార్య రజని, కుమార్తె హేవిత్రశ్రీ హెల్పింగ్ మైండ్స్ కార్యాలయానికి విచ్చేసి కేశాలు దానం చేశారు. కేశాలు దానం చేసిన రజని, హేవిత్రశ్రీలకు ప్రశంసా పత్రాలతో పాటు పూల మొక్కలు బహుకరించిన హెల్పింగ్ మైండ్స్ బృందం అభినందించారు. ఈ సందర్భంగా వ్యవస్థాపకుడు అబూబక్కర్ సిద్దిక్ మాట్లాడుతూ కేశాల దానంలో ఇప్పటికి 73 మంది కేశాలు దానం చేశారని, కేశాలు దానం చేస్తున్న మహిళలు, చిన్నారులు పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. క్యాన్సర్ భాదితులకు తమ సంస్థ ఉచితంగా విగ్గులు కూడా అందిస్తున్నామని పేర్కొన్నారు. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో కేశాలు దానం చేసినట్లు హేవిత శ్రీ తెలిపింది. కార్యక్రమంలో హెల్పింగ్ మైండ్స్ సభ్యులు కిరణ్, చైతు, చరణ్ పాల్గొన్నారు.



కేశాలు దానం చేస్తున్న రజని, హేవిత్రశ్రీ


మాట్లాడుతున్న జెసి ఆదర్శ రాజేంద్రన్

రహదారి పనులు వేగవంతం చేస్తాం : జెసి

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

రాయచోటి–చాగలమర్రి జాతీయ రహదారి పనులను వేగవంతం చేస్తామని జాయింట్ కలెక్టర్ ఆదర్శరాజేంద్రన్ పేర్కొన్నారు. గురువారం లక్కిరెడ్డిపల్లి ఎంపిడిఒ సభా భ వనంలో రహదారి విస్తరణలో ఇల్లు, ఇంటి స్థలాలు కోల్పోయిన లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ జాతీయ రహదారి విస్తరణలో ఉన్న గృహా లకు సంబంధించి నష్టపరిహారాన్ని ప్రభుత్వం ఇప్పటికే అందించిందని అన్నారు. ఇంకా పరిహారం అందని వారు ఇతర సమస్యలు ఏమైనా ఉంటే కలెక్టరేట్‌కు వచ్చి పరిష్కరించు కోవాలని తెలిపారు. జూన్ 10వ తేదీ లోపు జాతీయ రహదారి విస్తరణలో ఉన్న గృహాలు, ఇంటి స్థలాలు ప్రభుత్వం రోడ్డు విస్తరణ నియమిం చిన వరకు తొలగించాలని సూచించారు. అనంతరం లబ్ది దారుల అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో తహశీల్దార్ శ్రీనివాసులు, ఎంపిడిఒ ఉషారాణి, ఆర్ఎస్‌డిటి హరిప్రసాద్, ఆర్ఐ రాజేష్, మండల సర్వేయర్ మదన్ మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.


రహంతుల్లా మృతి పార్టీకి తీరని లోటు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-కలికిరి

మాజీ ఎంపిపి, మాజీ జడ్‌పిటిసి రహంతుల్లా మృతి పార్టీకి తీరని లోటని పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన గత కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందుతూ బుధవారం సాయంత్రం మృతి చెందిన విషయం విదితమే. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కిషోర్‌కుమార్‌రెడ్డి గురువారం ఉదయం మసీదు వీధిలోని ఆయన ఇంటికి వెళ్లి పార్థివదేహానికి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు తరాలుగా నల్లారి కుటుంబానికి నమ్మకమైన వ్యక్తిగా ఉంటూ, మండలంలో పార్టీ అభివృద్ధికి ఎంతో కృషి చేశారని, అలాంటి వ్యక్తి మృతి చెందడం పార్టీకి నల్లారి కుటుంబానికి తీరని లోటు అని అన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు నిజాముద్దీన్, ఉపాధ్యక్షుడు రెడ్డప్ప రెడ్డి, నల్లారి చంద్రారెడ్డి, అస్లాంబాషా, వాటర్ షెడ్ రవి, సనావుల్లా, ఉప్పారెడ్డి, శ్రీనివాస్ వర్మ, వైజాగ్ బాషా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్‌ఐగా శివకుమార్ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-పుల్లంపేట



మండల నూతన ఎస్‌ఐగా బి.వి.శివకుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్‌ఐ మోహన్ కుమార్ గౌడ్ వైఎస్ఆర్ జిల్లాకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో నూతన ఎస్‌ఐగా బి.వి. శివకుమార్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అన్నివేళలా అందుబాటులో ఉంటానని ఏ సమస్య వచ్చినా తక్షణం తమ దృష్టికి తీసుకుని వస్తే వారికి న్యాయం చేస్తామని చెప్పారు. అసాంఘిక కార్య కలాపాలను అరికట్టేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. క్రికెట్ బెట్టింగ్, మట్కా, పేకాట, ఎర్రచందనం అక్రమ రవాణాపై ఉక్కు పాదం మోపుతామని అన్నారు. బెల్ట్ షాపులపై ప్రత్యేక నిఘా ఉంచుతామని తెలిపారు.

గంగమ్మ జాతరకు ఎమ్మెల్యేకు ఆహ్వానం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

పట్టణంలోని కోర్టు ఆవరణంలో వెలసిన కోర్టులో గంగమ్మ జాతరకు రావాలని గురువారం ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే షాజహాన్ బాషాను ఆహ్వానించారు. జూన్ 3, 4 తేదీలలో జాతర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల చరిత్ర కలిగిన కోర్టులో గంగమ్మ జాతర వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లను ఘనంగా చేస్తుండడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. మదనపల్లె పరిసర ప్రాంత ప్రజలు పెద్దఎత్తున జాతరలో పాల్గొనాలని కోరారు. జాతరకు పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసేందుకు పోలీసులు చర్యలు చేపట్టాలని సూచిం చారు. ఎమ్మెల్యే ను కలిసిన వారిలో మార్పురి మహేష్, మల్లికార్జున నాయుడు, చిన్న రెడ్డప్ప, పెరవలి వేణుగోపాల్,వజీరపాంలి దేవేంద్ర (విన్ని), కరుణాకర్, ప్రభాకర్, సాయి గణేష్, కృష్ణకుమారి, జెసిబి వేణు ఉన్నారు.


బాధిత కుటుంబాలకు చెక్కులు అందిస్తున్న వరలక్ష్మీ

బాధితులకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి-చిట్వేలి

మండల పరిధిలోని మైలపల్లి రాచపల్లిలో ఇటీవల ఒకే గ్రామానికి చెందిన ముగ్గురు చిన్నారులు నీటి కుంటలో పడి మృతి చెందిన విషయం తెలిసిందే. పేదలైన వారికి గురువారం ముక్కు ఫౌండేషన్ ద్వారా రూ.1.80 లక్షల చెక్కును ఎమ్మెల్యే అరవ శ్రీధర్, కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి సతీమణి వరలక్ష్మీ బాధితులకు అందించారు. అనంతరం వారిని ఓదార్చి భరోసానిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్నారుల మృతి తల్లిదండ్రుల కడుపుకోత మాటల్లో చెప్పలేనిది విచారం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అగ్రహారం మాజీ సర్పంచ్ చేపిపట్టు పెంచల్ రెడ్డి, రాజుకుంట సర్పంచ్ గుత్తి నరసింహ, స్కూల్ కమిటీ చైర్మన్ శంకర్‌రాజు, మాదాసు నరసింహ, రవిరాజు, యానాదిరాజు, దొడ్డ వాగు మధు పాల్గొన్నారు.

ఉపాధి పనులు పరిశీలన

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

మండలంలోని గంగిరెడ్డి పల్లెలో గురువారం జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఎపిడి నందకుమార్‌రెడ్డి తనిఖీ చేశారు. కూలీలు ఏర్పాటు చేస్తున్న పారం పండ్ పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం స్త్రీశక్తి భవన్‌లో ఉపాధి సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రామాల వారి జరుగుతున్న పనులు కూలీల సంఖ్యా చెల్లించిన బిల్లులు, బిల్లుల చెల్లింపు తదితర అంశాలపై ఆరా తీశారు. పనులలో ఎక్కువమంది కూలీలు పాల్గొనే విధంగా ఎపిఓలు ఫీల్డ్ అసిస్టెంట్లు చొరవ చూపాలన్నారు. జరిగిన పనులకు కొలతలు తీసి సకాలంలో చెల్లించే విధంగా చొరవ చూపాలన్నారు. గ్రామాల్లో రైతులను సంప్రదించి పండ్ల తోటల పెంపకం పై అవగాహన కల్పించి ఆసక్తి కలిగిన రైతులను నమోదు చేయాలన్నారు. ఈ సమావేశంలో ఎపిఒ అంజన్‌రెడ్డి, ఎఇ మహేష్, జిఐఎస్ ఇంజనీర్ నాగరాజు, మండల టెక్నికల్ ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

వైసిపల్లి ఉప సర్పంచ్ ఎన్నిక వాయిదా

ప్రజాశక్తి-నందలూరు : మండలంలోని మారుమూల ప్రాంతమైన ఎర్ర చెర్లోపల్లి (వైసిపల్లి) ఉప సర్పంచ్ ఎన్నిక వాయిదా పడినట్లు రాధాకృష్ణరావు, ఇఒఆర్‌డి సునీల్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా గురువారం వారు మాట్లాడుతూ వార్డు మెంబర్లు హాజరు కాని కారణంగా ఈ ఎన్నిక వాయిదా పడడం జరిగిందని అన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తిరిగి ఎన్నిక జరిగే తేదీని ప్రకటిస్తామని తెలిపారు.

మండలాభివృద్ధికి కలిసికట్టుగా పనిచేద్దాం : ఎంపిపి


మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి శ్రీదేవి రవికుమార్

ప్రజాశక్తి-కలకడ

మండల అభివృద్ధి కోసం కలిసికట్టుగా పని చేద్దామని ఎంపిపి శ్రీదేవి రవికుమార్ పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రమైన కలకడ మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లా డుతూ ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసే మండల అభివృద్ధికి సహకరించాలని కోరారు. మండలంలోని బాలయ్యగారిపల్లి, దేవులపల్లి, కోన పంచాయితీలలో విద్యుత్ స్తంభాలు శిథిల అవస్థకు చేరి పడిపో యినందుకు సిద్ధంగా ఉన్నాయని, ఆయా పంచాయతీల సర్పంచులు విశ్వనాథ నాయుడు, వెంకటరమణ, రాజగోపాల్ రెడ్డిలు అధికారులకు తెలి పారు. ఈ పంచాయతీలలో విద్యుత్ వైర్లు చాలా కిందికి ఉండి ప్రమా దాలకు, ప్రాణనష్టానికి చేరువుగా ఉన్నట్లు తెలిపారు.ఎన్నో పర్యాయాలు ట్రాన్స్‌కో అధికారులకు విన్నవించినా ఫలితం మాత్రం శూన్యమని తెలిపారు. అనంతరం ట్రాన్స్‌కో ఎఇ మాట్లాడుతూ వీలైనంత త్వరగా పరిశీ లించి సమస్యను పరిష్కరించడానికి చర్యలు చేపడతామని హామీనిచ్చారు. మండలంలో పంచాయ తీరాజ్ ద్వారా రూ.1.80 కోట్ల నిధులతో గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లను వేయడం జరుగుతుందని తెలిపారు. గ్రామాలలో రోడ్లు మరమ్మతులు, నూతన రోడ్లు నిర్మాణం చేయడం జరుగుతుందని పిఆర్ఎ రూపుసాగర్ పేర్కొన్నారు. జిల్లాలో కలకడ మండలాన్ని అభివృద్ధి పథంలో ఉంచేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎంపిడిఒ అబ్దుల్ రహీం కోరారు. మండల సమావేశంలో సజావుగా జరిగేందుకు ఎఎస్ఐ మల్లి కార్జున, పోలీస్ సిబ్బంది రామ్మోహన్, సుబ్బయ్య బందోబస్తు నిర్వహిం చినట్లు తెలిపారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఫణికుమార్, ఎంపిటిసిలు, సర్పంచులు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

అసంపూర్తి గృహ నిర్మాణాలను పూర్తి చేయండి

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

మండలంలో జరుగుతున్న పక్కా గృహ నిర్మాణాలను వేగంగా పూర్తి చేయాలని ఎంపిడిఒ పరమేశ్వర్‌రెడ్డి అన్నారు. గురువారం కొండ య్యగారిపల్లి పంచాయతీ వెంకో జిగారిపల్లెలో హౌసింగ్ ఎఇ అమర్నాథ్‌తో కలసి లబ్ధిదారులకు అసంపూర్తి గృహాల నిర్మాణాలపై పలు సూచనలు చేశారు. గత ప్రభుత్వ హయాంలో నిరుపేదలకు ఇచ్చిన పక్కా గృహాల నిర్మాణ పనులను ఇప్పటికీ కొంతమంది పూర్తి చేయకపోవడంతో అవి అసం పూర్తిగా అలాగే ఉన్నాయన్నారు. ప్రస్తుత ప్రభుత్వం పక్కా గృహ నిర్మా ణాల కు గతంలో ఉన్న రూ.1.80 లక్షలకు అదనంగా ఎస్‌సి, బిసిలకు రూ.50 వేలు, ఎస్‌టిలకు రూ.75వేలు ఆర్థిక సాయాన్ని మంజూరు చేస్తోం దన్నారు. మండలానికి 2078 పక్కా గృహాలు లబ్ధిదారులకు మంజూరు కాగా, 1648 మంది లబ్ధిదారులు గృహ నిర్మాణాలను పూర్తి చేశా రన్నారు. 421 గృహాలు వివిధ దశల్లో నిర్మాణాలు జరుగుతున్నాయని తెలి పారు. 294 మంది లబ్ధి దారులకు గృహ నిర్మాణ కొరకై ప్రభుత్వం అదనపు ఆర్థిక సాయాన్ని మం జూరు చేసిందన్నారు. కొంతమంది లబ్ధిదా రులకు వారి బ్యాంకు ఖాతాలో అదనపు ఆర్థిక సాయం జమ కావడం జరిగిందన్నారు. అసంపూర్తి గృహాల నిర్మాణ పనులను లబ్ధిదారులు వెంటనే చేపట్టి, నిర్మాణ పనులను పూర్తి చేయాలని తెలిపారు. ప్రతి శనివారం హౌసింగ్ అధికారులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్ లేఅవుట్లను సందర్శించి పనుల పురోగతిపై నివేది కలను అందిం చాలని తెలిపారు. అసంపూర్తి గృహాల నిర్మాణ పనులపై ఉన్నత స్థాయి అధికారులు ఎప్పటికప్పుడు సమీక్షలు చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మహమ్మద్ రఫీ, హౌసింగ్ ఎఇ అమర్నాథ్, వర్క్ ఇన్స్‌పెక్టర్ అనూష, ఇంజినీరింగ్ అసిస్టెంట్ హేమా, లబ్ధిదారులు పాల్గొన్నారు.


గృహ నిర్మాణాలపై సూచనలు ఇస్తున్న ఎంపిడిఒ పరమేశ్వర్‌రెడ్డి

గంగమ్మ ఆలయ గదుల వేలం పాట రద్దు


వేలంపాటదారులతో మాట్లాడుతున్న ఇఒ మునిరాజ్

ప్రజాశక్తి-బి.కొత్తకోట

పట్టణంలోని గంగమ్మ ఆలయానికి సంబంధించిన గదుల వేలంపాటను రద్దు పరిచినట్లు గురువారం దేవాదాయ శాఖ అధికారులు తెలిపారు.గత కొన్ని సంవత్సరాల నుంచి ఎవరికి తెలియకుండా దేవదాయ శాఖ అధికారులతో గుట్టుచప్పుడు కాకుండా కొందరు వ్యక్తులు రెన్యువల్ చేసుకుంటూ వేలంపాట నిర్వహించినట్లు చూపుతూ రూముల్లో తిష్ట వేశారు. ఈ విషయం మూడేళ్ల క్రితం దేవదాయశాఖ కర్నూల్ కమిషనరర్ దృష్టికి వెళ్లింది. అప్పుడు దేవాదాయ శాఖ అధికారులు బహిరంగ వేలం వేయడంతో రూ.200 చొప్పున దేవాదాయ శాఖ గదులకు అద్దెలు చెల్లించేవారు. ప్రజల తో పోటీపడి మరి దేవాదాయ శాఖకు అధిక ఆదాయం చేకూర్చేవారు. మూడేళ్ళ కాల వ్యవధి ముగియడంతో రూములు అద్దెకు ఇచ్చేందుకు వేలం పాటను నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈ వేలంపాటకు వచ్చిన ప్రజలు తాము వేలంలో పాడుకున్నా గతంలో గదుల్లో ఉన్నవారు ఖాళీ చేయకుండా కాలం గడుపుతారని ఆరోపించారు. ఏప్రిల్ 30న గదుల్లో ఉన్న వారిని ఖాళీ చేయించి వేలంపాట నిర్వహించేందుకు వచ్చిన అధికారులపై బిజెపి మండల అధ్య క్షుడు ముకుంద, మరికొందరు అడ్డుకున్నారు. వేలంపాట పాడేందుకు డబ్బులు చెల్లించిన వారికి తిరిగి వారి డబ్బులు వారికి చెల్లించారు. ఈ సంద ర్భంగా ఇఒ మునిరాజు మాట్లాడుతూ బి.కొత్త కోటలోని దేవాదాయశాఖ చెందిన అన్ని భూములను, గదులను బహిరంగ వేలం వేస్తా మని మరల బహిరంగ వేలం తేదీని తెలియజేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో దేవా దాయ శాఖ ఇన్స్‌పెక్టర్ శశికుమార్, దేవాదాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు వరం సిఎం సహాయనిధి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-పుల్లంపేట

సిఎం సహాయనిధి పేదలకు వరంలాంటిందని రైల్వేకోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్, టిడిపి యువనాయకులు ముక్కా సాయివికాస్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని వత్తలూరు పంచా యతీ తిరుమలయ్యగారిపల్లె గ్రామానికి చెందిన కవేటి బ్రహ్మయ్యకు రూ.2,46,054లు వత్తలూరు గ్రామానికి చెందిన సిద్ధవటం రితీష్‌కు రూ.30వేలు సిఎం సహాయనిధి చెక్కులను అందించారు. బాధితుల నివాసానికి వెళ్లి బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిఎం సహాయనిధి ద్వారా అనేక మంది పేదలకు లబ్ది జరుగుతుందన్నారు. అప్పు చేసి లక్షలాది రూపాయలతో వైద్యం చేయించుకున్న వారికి సిఎం సహాయనిధి ఆసరాగా నిలుస్తోంద న్నారు. ప్రభుత్వం చేపట్టిన ఆరోగ్య పథకాలతో పేద కుటుంబాలు ఉపశమనం పొందుతున్నాయని అన్నారు.


బాధితుడికి సిఎం సహాయనిధి చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్

గ్రామాల్లో నీటి ఎద్దడి నివారణే లక్ష్యం : 'చమర్తి'


తాగునీటి బోరును ప్రారంభిస్తున్న జగన్‌మోహన్‌రాజు


ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ప్రతి గ్రామంలో నీటి ఎద్దడి లేకుండా చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని, అందుకే ఎక్కడా నీటి సమస్య లేకుండా చర్యలు చేపడుతున్నామని టిడిపి జిల్లా అధ్యక్షులు చమర్తి జగన్మోహన్‌రాజు తెలిపారు. గురువారం మండల పరిధిలోని కొమ్మివారిపల్లిలో నీటి కోసం బోర్లకు ప్రత్యేక పూజలు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా చమర్తి మాట్లాడుతూ నియోజ కవర్గంలోని ప్రతి గ్రామంలోనూ అన్ని సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తా మని అన్నారు. వేసవిలో నీటి సమస్య లేకుండా ముందుగానే గ్రామాలలో నూతనంగా బోర్లు ఏర్పాటు చేసి ప్రజలకు ఇబ్బం దులు లేకుండా చేయడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ఒక ప్రజా సేవకునిగా ప్రజల సమ స్యలను తీర్చడంలో తనకు చాలా ఆనందం కలుగుతుందన్నారు. ఎక్కడ సమస్య ఉంటే అక్కడ పరిష్కార మార్గాన్ని చూపేందుకు తాను సిద్ధంగా ఉన్నానని అన్నారు. అందరూ కలిసికట్టుగా పనిచేస్తే గ్రామాలలో సమస్యలు ఉండ వని, సమస్యలు లేని గ్రామాలను నెలకొల్పడమే తమ ధ్యేయమని పేర్కొ న్నారు. కార్యక్రమంలో రాజంపేట టిడిపి మండల అధ్యక్షులు గన్నేసుబ్బ నరసయ్య నాయుడు, ఉపాధ్యక్షులు సతీష్‌రాజు, గీతాంజలి విద్యాసంస్థల అధినేత ఎస్.వి.రమణ, బాపనయ్య నాయుడు, కమ్మ సంఘం అధ్యక్షుడు శివ నారాయణ చౌదరి, మాజీ ఎంపిటిసి గుడారు సుబ్రహ్మణ్యం నాయుడు, కొమ్మి సుబ్రహ్మణ్యం, యువ నాయకులు పరుశురాం నాయుడు, ఉప సర్పం చ్ నాగినేని నరసింహులు నాయుడు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గాలివాన బీభత్సం : నేలరాలిన మామిడి

ప్రజాశక్తి-తంబళ్లపల్లె

మండలంలో సాయంత్రం గాలివాన బీభత్సం సృష్టించింది. గాలి తాకిడికి మామిడి తోటలలోని మామిడికాయలు నేలరాలాయి. మామిడి రైతు ఆశ నిరాశ అయిందని నిట్టూరుస్తున్నారు. తంబళ్లపల్లి, కోసువారి, కోసువారిపల్లి ఎర్రసాని పల్లె, రేణిమకులపల్లె, గుండ్లపల్లె, కొటాల పంచాయతీలలో పలు మామిడి తోటలలో గాలి వానకు మామిడికాయలు నేలరాలాయి. రైతులకు అపార నష్టం వాటిల్లింది. అరకొరో ధర పలికి ఆదాయం పొందవచ్చునని ఆశించిన రైతులకు నిరాశ మిగిలింది. ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకుంటున్నారు. 27.2 మండలంలో మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్టు ఎఎస్ఒ శ్రీ దుర్గా తెలిపారు.


నేలరాలిన మామిడి కాయలను చూపుతున్న రైతు

విద్వాన్ కట్టా నరసింహులుకు ఘన నివాళులు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్


కట్టా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కమిటీ సభ్యులు

ప్రముఖ తాళపత్ర పరిశోధకులు, కవి పండితులు, రచయిత, అవధాని, సాహితీవేత్త స్వర్గీయ విద్వాన్ కట్టా నరసిం హులు నాలుగవ వర్ధం తి వేడుకలను పట్టణ ంలో గురువారం ఘనం గా నిర్వహించారు. తెలుగు భాషా సంరక్షణ సమితి ఆధ్వర్యంలో స్థానిక జవుళీ బజారులోని సరస్వతీ విద్యా మందిరంలో ఈ వేడుకలను నిర్వహించారు. సమితి జిల్లా సహాయ కార్యదర్శి గంగనపల్లి వెంకటరమణ, రాజంపేట మండల శాఖ అధ్యక్షులు బొట్టా రామచంద్రయ్య నాయుడు, ఉపాధ్యక్షులు బి.వి.నారాయ ణరాజు, సమితి ప్రతినిధులు యుపి.రాయుడు, వేల్పుల వెంకటసుబ్బయ్య పాల్గొని కట్టా నరసింహులు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. తాళపత్ర పరిశోధక అగ్రగణ్యులుగా, కవిగా, తెలుగు ఉపాధ్యాయులుగా స్థానిక చరిత్రను తెలిపే మెకంజీ కైఫియత్తులను కడప సిపి బ్రౌన్ భాషా పరిశోధక గ్రంథాలయం ద్వారా వెలుగులోకి తెచ్చారని, కట్టా నరసింహులు చేసినటువంటి సేవలను వారు స్మరించుకున్నారు.


పిహెచ్‌సిలో వైద్యులతో మాట్లాడుతున్న రామచంద్రారెడ్డి

పిహెచ్‌సిని తనిఖీ చేసిన మలేరియా అధికారి

ప్రజాశక్తి - గాలివీడు

మండల కేంద్రమైన గాలివీడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం జిల్లా మలేరియా అధికారి వై.రామచంద్రరెడ్డి తనిఖీ చేశారు. జూన్ 1వ తేదీ నుంచి మలేరియా మాసోత్సవాలు ప్రారంభమవుతున్న సందర్భంగా మండల కేంద్రంలోని కెజిబివి కళాశాల, బిసి బాలికల వసతి గృహం, బిసి బాలురవసతి గృహం, ఎస్‌సి బాలుర వసతి గృహంలో జరుగుతున్న సైపర్ మెత్రిన్ స్ప్రేయింగ్ కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. దీనివలన మలేరియా, డెంగీ, చికెన్ గున్యాను కలుగజేసే దోమల వ్యాప్తిని అరికట్టవచ్చని అన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రికార్డులను తనిఖీ చేశారు. సిబ్బందికి పలు సూచనలు సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ రాధా మాధవి, సబ్ యూనిట్ ఆఫీసర్ దానం, సిహెచ్ఒ చంద్రకళ, పిహెచ్ ఎన్ ఎం.సాలమ్మ, పారా మెడికల్ సిబ్బంది మురళి, ఆనంద జ్యోతి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు ప్రకృతి వ్యవసాయంపై సదస్సు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

స్థానిక వెలుగు మహిళా సమాఖ్య సమావేశ భవనంలో శుక్రవారం ప్రకృతి వ్యవసా యంపై వ్యవసాయ శాఖ, ఎపి సిఎన్ఎఫ్ మహిళా సంఘాల సభ్యులకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు మదనపల్లె మండల వ్యవసాయ శాఖ అధికారి నాగ ప్రసాద్ గురువారం ఓ ప్రకట నలో తెలిపారు. రైతులు, మహిళలు హాజరై ప్రకృతి వ్యవసాయంపైన అవగాహన పెం పొందిం చుకో వాలని పేర్కొన్నారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా ఖర్చులు తగ్గించుకొని ఆదాయ వనరులను పెంపొందించుకోవడంతో పాటు ప్రజల ఆరోగ్యానికి దోహదపడ గలరన్నారు. ఈ సదస్సుకు రైతులందరూ ఆహ్వానితులేనని తెలిపారు.



మాట్లాడుతున్న సుశాంత్‌కుమార్

బ్యాంకు అభివృద్ధికి ప్రజల సహకారం అవసరం

ప్రజాశక్తి-వీరబల్లి

బ్యాంకు అభివృద్ధికి ప్రజల సహకారం ఎంత అవసరమని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ శాఖ రీజినల్ మేనేజర్ సుశాంత్‌కుమార్‌స్వరో పేర్కొన్నారు. గురువారం వీరబల్లిలో సచివాలయం ఎదురుగా నూతన భవనాన్ని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ మేనేజర్ మనోహర్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాత భవనంలో అటు ప్రజలకు, అధికారులకు సౌకర్యాలు సక్రమంగా లేకపోవడంతోనే భవనాన్ని మార్చాల్సి వచ్చిందన్నారు. పాత భవనాన్ని త్వరలో కొత్త భవన నిర్మాణం చేయడానికి చర్యలు తీసుకుం టామని తెలిపారు. బ్యాం కులు ఎన్ని ఉన్నా ఆంధ్ర ప్రదేశ్ గ్రామీణ బ్యాంకుకు మంచి ఆదరణ ఉందన్నారు. ఏప్రిల్ 30 వరకు ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకుగా ఉందని, కేంద్ర ప్రభుత్వం నిర్ణయం మేరకు మే మొదటి వారం నుంచి రాష్ట్రంలో ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్, సప్తగిరి గ్రామీణ బ్యాంక్, చైతన్య గ్రామీణ బ్యాంక్, వికాస్ గ్రామీణ బ్యాంక్ ఈ నాలుగు బ్యాంకులు కలిసి ఒక కొత్త ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్‌గా మారాయని అన్నారు. ఈ బ్యాంకులు మొత్తం ఇండియా లెవెల్‌లో సెకండ్ స్ట్రాంగెస్ట్ బ్యాంక్ అంటే మన ఆంధ్ర ప్రదేశ్ గ్రామీణ బ్యాంకు అవుతుందన్నారు. ఖాతాదారులు బ్యాంకుకు కుటుంబ సభ్యులు అన్నారు. ప్రస్తుతం రైతులకు రూ.2 లక్షల వరకు సూరిటీ సైన్ లేకుండా రుణం అందిస్తామన్నారు. రైతులు సూరిటీ కోసం ఎవరు ఇబ్బందులు పడాల్సిన అవసరం లేదన్నారు. విదేశీ విద్య, గృహాలకు ఇతర పరిశ్రమల ఏర్పాటుకు రుణాలు తక్కువ వడ్డీతో రుణాలు ఇస్తామని చెప్పారు.బ్యాంక్ మేనేజర్ మనోహర్ మాట్లాడుతూ రైతులు ఎటువంటి ఇబ్బందులు లేకుండా బ్యాంకు సేవలంది స్తున్నట్లు చెప్పారు. పొదుపు సంఘాలకు రూ.20 లక్షల వరకు రుణాలు ఇస్తామన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. వాటితోపాటు ఇన్సూరెన్స్ తప్పక వర్తిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఫీల్డ్ ఆపీసర్లు, బ్యాంకు సిబ్బంది, ఖాతాదారులు పాల్గొన్నారు.

పిహెచ్ఎంఇయు నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-పీలేరు


అధ్యక్ష, కార్యదర్శులు విద్యాసాగర్, చిన్నప్ప

పబ్లిక్ హెల్త్ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ 3194 చిత్తూరు జిల్లా, పీలేరు తాలూకా నూతన కార్య వర్గం ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. పిహెచ్ ఎంఇ యు జిల్లా అధ్యక్షులు ఏ. లక్ష్మీనారాయణ ఆధ్వర్య ంలో జిల్లా సంయుక్త కార్యదర్శి కుసుమకుమారి ఎన్నికల అధికారిగా, జిల్లా ఆర్గనైజేషన్ సెక్రటరీ శ్యామల ఎన్నికల పరిశీలకులాగా గురువారం పీలేరులో పీలేరు తాలూకా కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తాలూకా అధ్యక్షులుగా టి.విద్యాసాగర్, వైస్ ప్రెసిడెం ట్లుగా రెడ్డెమ్మ, జి.మునిలక్ష్మి, ఎస్.వెంకటరమణ, జనరల్ సెక్రటరీగా ఆర్.చిన్నప్ప, సంయుక్త కార్యదర్శులుగా ఎన్.అరుణ, పి.యుగంధర్, ఎన్.పంకజం, కోశాధికారిగా ఆర్. శివప్రసాద్‌బాబు, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ వైద్య ఆరోగ్య సిబ్బంది సమస్యల పరిస్కారం కోసం కృషి చేస్తానని, ఫిల్డ్ సిబ్బందికి ఎఫ్ఆర్ఎస్ రద్దు చేసేందుకు ప్రయత్నం చేస్తున్నట్లు తెలిపారు.

సికిల్ సెల్ అనీమియా నిర్మూలన మనందరి బాధ్యత

ప్రజాశక్తి-వాల్మీకిపురం

సికిల్ సెల్ అనీమియా వ్యాధి నిర్మూలన మనందరి బాధ్యత అని మండలంలోని చింతపర్తి పిహెచ్‌సి డాక్టర్ జులేఖబేగం అన్నారు. గురువారం మండలంలోని చింతపర్తి పిహెచ్‌సిలో సికిల్ సెల్ ఎనీమియా నిర్మూలన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ జులేఖబేగం మాట్లాడుతూ సికిల్ సెల్ ఎనీమియా వ్యాధి వారసత్వంగా వచ్చే ఎర్రరక్తకణాల రుగ్మతని, తల్లిదండ్రుల నుంచి అనువంశికంగా సంక్రమిస్తుందన్నారు. సచివాలయాల్లో ఉన్న ఎఎన్ఎంల వద్ద వ్యాధి నిర్ధారణ కిట్లు ఉన్నాయని, 40ఏళు లోపు ఉన్న గిరిజనులు ఈ పరీక్షలు చేయించుకోవాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ సాయిశ్రీ, డాక్టర్ సనా అయేషా, హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్ రఫీ, ఎంఇఒ వెంకటలక్ష్మి, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ అరుంధతి, సూపర్‌వైజర్ సుధాకర్, లింక్‌వర్కర్ రమణ పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న జులేఖబేగం